# సాదృశ్యాలు

"సత్య శ్రీ"

వెన్నుమీద బలంగా ఎవరో చరచినట్టై ఉలిక్కిపడిలేచి కూర్చుండి పోయాను ప్రక్కమీద—

ఎందుకో శరీరం అంతా వణికిపోతూన్నట్టు వుంది. గుండెలు వేగంగా కొట్టుకుంటూన్నాయి. ఒళ్లంతా చెమటపట్టి శరీరంలోనుంచి వెచ్చటి పొగలు గ్రమ్మినట్టైంది.

అలానే మంచంమ్మీద రెండుక్షణాలు కూర్చుని గదిలో చుట్టూకలయ చూచాను. గదిలో ఎవరూ కనిపించలేదు. మరేవిధమైన సవ్వడి వినిపించలేదు. గదిలో వెల్లాడే లైటు ప్రశాంతంగా వెలుగుతోంది.

ఎందుకిలా ఉలిక్కిపడి లేచాను?

ఎవరూ కనిపించరే...!

ఈ విచిత్రమైన సంఘటనకు నాలో నాకే నవ్వొచ్చింది. చంటికుర్రడిలా ఉలిక్కిపడి లేచానేమిటి...? అయితే అది సామాన్యమైన ఝుడుపులా లేదు. ఎవరో భయంకరమైన రాక్షసుడు తన యినుపహస్తాలతో చరిచి లేపినట్టైంది. శరీరంలోని సత్తువంతా పోయి ప్రాణం అతిగా నీరసించినట్టు అయింది.

మెల్లగా మంచం దిగి, బయట వరండాలో కెళ్లి చూచాను. గది బయటా ఏ వ్యక్తీ వున్నట్టు పొడమూప లేదు.

మేడక్రింది గదిలోనుంచి శాంత ప్రక్కలో పడుకున్న చంటివాడి ఏడుపు సన్నగా వినిపిస్తోన్నట్టు వినిపిస్తుంది. అమ్మ, శాంతా మేల్కొని ఏదో మాట్లాడుతూన్న శబ్దం వినిపిస్తూంది. మేడక్రింద మధ్య హాల్లో వున్న గోడ గడియారం రెండుగంటలు కొట్టిన చప్పుడు వినిపించింది.

మళ్ళీ గదిలోకి వచ్చేస్తాను.

నేను పడుకునే మంచందగ్గరున్న కిటికీలోనుంచి చూస్తే దూరంగా సముద్రం ఘోష పెడుతూ కనిపిస్తూంటుంది. ఆకాశంలోకి ఎక్కుతూన్న చంద్రుడు వెన్నెల కురిపిస్తూన్నాడు. తెల్లగా మిలమిలా పాలపొంగులా మెరిసే సముద్రం, నల్లగా మసకమసగ్గా, వంకరటింకరగా కనిపించేతీరం దానిపొడుగూనా పెరిగినకొబ్బ చెట్లు, ఏదో యింకా పిచ్చిపిచ్చిగా పెరిగిన పొదలు వింత వింత ఆకారంలో కనిపిస్తూన్నాయి. ఆ ప్రశాంతతలో ఆ వెన్నెల్లో కూడా ప్రకృతి చూట్టానికి ఏదో భయం భయంగా వుంది. కడలి తీరంలో, చెట్లనీడల్లో మసకమసక చీకట్లు పెనవేసుకుని, హోరుమనిఘోషించే సముద్రతరంగాల సర్వడిలో కలిసి ఘోరంగా నృత్యం చేస్తున్నట్టు వుంది.

నాలో క్షణంక్రితం సంభవించిన సంఘటన తాలూకు చిహ్నాలు యింకా పోలేదు. ఆ వణుకు దడ యింకా పోలేదు. మళ్లీ నిద్రపోదా మనుకున్నా యింతలో నిద్రపట్టేలా కనిపించలేదు.

తలగడ క్రిందవున్న సిగరెట్టుటిన్ను, అగిపెట్టె తీశాను. కిటికీదగ్గరకు వచ్చి సిగరెట్టు వెలిగించబోయాను.

కిటికీలోనుంచిగాలి ఒక్కసారిగా వీచింది. ఆ వీచడంలోనూ ఎవరో నోటితో బలంగా వూదినట్టై వెలిగించిన అగ్గిపుల్ల టప్ మని ఆరిపోయింది.

నేను తెల్లబోయాను.

హృదయం ఝల్లుమంది.

ఎందుకోశరీరంఅంతా గగుర్పాటు కలిగినట్టయింది. ఇది జరిగిన మరుక్షణంలోనే గదిలో లైటు కూడా ఎవరో స్విచ్ ఆఫ్ చేసినట్టు టక్ మని శబ్దమై ఆరిపోయింది...!

గదిఅంతా అంధకారం. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించడంలేదు.

లైటుఎందుకారిపోయింది?ఎలా ఆరిపోయింది.... ఎవరో స్విట్ ఆఫ్ చేసినట్టు టక్ మని శబ్దమయిందే...? ఒకవేళ కరంట్ ఆఫ్ అయితే ఆశబ్ద మెందుకొస్తుంది?

నాకేమీ అర్థం కాలేదు.

మరో రెండు మూడుసార్లు అగ్గిపుల్ల గీశాను గాని వెలగలేదు. ఎన్ని పుల్లలు గీసినా వెలగలేదు.

ఎందుకో గుండెలు వేగంగా కొట్టుకోడం మొదలు పెట్టాయి. ఏదో వింతగా వున్నట్టు కనిపించింది.

ధైర్యం చేసి, చీకట్లోనే తడుముకుంటూ సోఫాలను వాటెని తప్పించుకుని వెళ్లి గోడకున్న స్విచ్ మీద చెయ్యి వెయ్యగానే షాక్ తగిలినట్లై ఉలిక్కిపడ్డాను.

స్విచ్ నిజంగానే ఆఫ్ చేసి వుంది!

యిది ఎలా సంభవించింది...గదిలో ఎవరూ కనిపించరే...?

మళ్లీ స్విట్ ఆన్ చేశాను—

ఈసారి గదిలో లైటు వెలగడానికి బదులు, గది బయట వరండాలో వున్న లైటు వెలిగింది...!

నేను తెల్లబోయాను.

శరీరంలోనుంచి పొగలు గ్రమ్మినట్లైంది. ఏదో భయం భయంగా వుంది.

స్విచ్ వెయ్యకుండానే బయట లైటు ఎలా వెలిగింది...?

నాకు అమితమైన ఆశ్చర్యం కలిగింది. ఎవరిలా చేస్తూంది? ఎవరూ కనిపించరే...?

ఆ లైటును మళ్లీ ఆఫ్ చేశాను. మళ్లీ గదిలో లైటు వెలిగింది. ఇది మాత్రం వెలగలేదు.

నాకాశ్చర్యం వేసింది. ఎవరో అదృశ్య వ్యక్తి యిలా చేస్తుండాలి. లేకపోతే ఏమిటీ చిత్రం? ఎవరైనా దొంగలా? దొంగలయితే యింత హంగామా ఎందుకు చేస్తారు? మరెవరు...?

ఎంత ఆలోచించినా ఏమీ అర్థంకాలేదు. ఉన్న ధైర్యం కాస్తా సన్నగిల్లి పోతూన్నట్టువుంది. క్రిందకు దిగి వెళ్ళిపోదామా అనిపించింది. కాని మళ్లీ ఎందుకో పిరికి పందలా, చంటి కుర్రడిలా ఝడుసుకుని దిగి వెళ్ళిపోవడం చిన్నతన మనిపించింది. ఏ మయిన కానిమ్మని మళ్ళీగదిలోకి వెళ్ళాను.

నాగదిలో లైటు ప్రశాంతంగా వెలుగుతోంది. ఇందాక ఆఫ్ చేసి వున్న స్విచ్, యిప్పుడు ఆన్ చేసి వుంది. అయితే గదిలో ఏ విధమైన సవ్వడి గాని లేదు, ఏ వ్యక్తిగాని కనిపించలేదు.

నేను గదిలోకి వెళ్లిన రెండుమూడు క్షణాలకి గదితలుపులు కీచుమని శబ్దం చేస్తూ మూసుకుపోయాయి.

నేను అదిరిపడ్డాను. వెనక్కి తిరిగి వెళ్ళి ఎంత లాగినా రాలేదు తలుపులు...!

గదిలో ఏదో హోరుమనే శబ్దం బయలుదేరింది. కిటికీ రెక్కలు టపటపమని కొట్టుకోడం మొదలు పెట్టాయి. గదిలో లైటు ఆరిపోయి ఆగి ఆగి వెలగడం మొదలు పెట్టింది...!

నాగదిలో ఒకటే గోల...! చెవులు చిల్లులు పడేలా ఒకటే రొద! నక్కలు పిల్లులు కుక్కలు కలసి ఏడ్చినట్టు, దెయ్యాలు రాక్షసలు కలసి నవ్వినట్టు ఒకటే రొద!

తలుపు ఎంత లాగినా రాదే! ఇప్పుడు బయటకు పోవడం ఎలా?

నేనేదో తెలియని ఘోర విపత్తులో చిక్కన్నానా... ఏవో అదృశ్య శక్తులు నన్నిలా భయపెడుతున్నాయా? ఏదో పైశాచిక చర్యకు లోనయ్యానా? ఏదైనా కలగంటున్నానా! యిది వాస్తవంగా జరుగుతోందా?

ఏమో! ఏమీ అర్థంకాదే...!

ఇంతలోనే ఆగి ఆగి వెలిగే లైటు ఒక్కసారిగా 'టప్' మని చిట్లిపోయి శాశ్వతంగా ఆరిపోయింది. కిటికీలు మూసుకుపోయాయి. గది అంతా అంధకారం! నేనెక్కడున్నానో నాకే అర్థం కావడంలేదు.

నాచేతిలో సిగరెట్టుటిన్ను, అగ్గిపెట్టె ఎవరో విసురుగా లాక్కున్నట్టయి మాయమయ్యాయి నా చేతిలో నుంచీ...!

కొన్ని క్షణాలకి అగ్గిపుల్లగీసిన చప్పుడై అగ్గిపుల్ల గాలిలో వెలిగి సిగరెట్టును ముట్టించింది.

సిగరెట్టుగాలిలో వెలుగుతోంది. నాకంటికి ఆ అంధకారంలో సిగరెట్టు చివరనున్న నిప్పురవ్వ తప్ప మరేమీ కనిపించడంలేదు. పొగమాత్రం గదంతా వ్యాపించిన వాసన గొడుతోంది.

నేను ఏ సహాయం కోసమైనా గట్టిగా కేక వేద్దామన్నా కేక రావడంలేదు. ఎంత ప్రయత్నించినా అది గొంతులోనే ఆగిపోతూన్నట్టు వుంది. నరాలన్నీ స్వాధీనంలో లేనట్టయింది... చైతన్య రహితంగా అలాగే తలుపుకు చేరబడి వుండిపోయాను—

ఆగాధాంధకారంలో రానురాను ఏదో అస్పష్టమైన ఆకారం కనిపించడం మొదలుపెట్టింది...దానిలోనుంచి ఒక బొంగురు గొంతు వినిపించింది.

"...శ్రీ...నీ...! శ్రీ నీ...!! నన్ను గుర్తుపట్టలేదు...? నా కంఠం తెలియడం లేదూ...?"

వదులు వదులుగా బిగించిన తీగ మీద కొడితే అయ్యే శబ్దంలా వుందా కంఠం...అందులో ఎప్పుడో విన్నది. పరిచయమైన కంఠస్వరం తాలూకు శబ్దాలు మిళితమైనట్లు వుంది...

ఎవరది...? నాకు సరిగా గుర్తు రాలేదు.

ఇంతలోనే ఆ ఆకారం స్పష్టమైంది.

నేను అదరిపడ్డాను...! నోట మాటకూడా సరిగా రాలేదు.

శంతన్...!! శంతన్‌రావుది...!-వీడు అచ్చం అలానే వున్నాడు! ఏనాటి శంతన్‌రావు...? ఇది ఎలా సంభవించింది...? ఇప్పుడు నేను చూస్తూన్నదీ అనుభవిస్తూంది నిజమా? కలా...?

ఆజానుబాహుడైన చెయ్యెత్తు విగ్రహం...బలంగా మెలికలు తిరిగిన కండలు, ముఖం నిండా స్ఫోటకపు మచ్చలతో, ప్రతీ ఒక్క మచ్చలోనూ క్రౌర్యం ఉట్టిపడేటట్టు కనిపించే గంభీరమైన ముఖం-కుడి కంటికి దగ్గరలో మొదలయి చెంప వరకు వ్యాపించినగాయం తాలూకు పొడుగాటి మచ్చ. ఎర్రగా జీరలు తేలి ఎప్పుడూ సీరియస్‌గా వుండే కళ్ళు. ఆ పెద్ద పెద్ద పాదాలు...అచ్చం శంతన్‌రావులానే వుంది ఆకారం. ముమ్మూర్తులా శంతన్‌రావే...!

అయిదేళ్ల క్రితం వూరు వదలి పోయాడు. మళ్లీ యిప్పటివరకూ తిరిగి రాలేదు. ఆ మధ్య చనిపోయాడని కూడా అనుకున్నారు! మరెలా వచ్చాడు? శంతన్‌రావు చనిపోయి భూతం అయి వచ్చాడా?

నేను ఆ ఆకారంవేపు స్తబ్ధుణ్ణయి చూస్తూ అలానే వుండిపోయాను.

ఆ ఆకారం మళ్లీ మాట్లాడింది !

"చూడు శ్రీనీ...! నిన్ను చూడాలని ఎన్నాళ్లీనుంచో అనుకుంటూన్నాను. అప్పుడు...ఆ రాత్రి! అదే నిన్ను ఆఖరిసారి చూడ్డం కదూ? నువ్వంటే నాకే మాత్రం కోపం లేదు శ్రీని...!! రా...! దగ్గరగా రా! నీకు కొడుకు పుట్టాడు కదు? ఒకసారి చూచిపోదామని వచ్చాను...!"

వాడు అట్టహాసంగా నవ్వేసరికి గుండెల్లో ఉరిమినట్టయింది. నా గదంతా మారుమ్రోగింది. రెండడుగులు ముందుకు వేశాడు.

"రా! దగ్గరగా రా శ్రీనీ! మనం ఖులాసాగా మాట్లాడుకుని ఎన్నాళ్లయిందో కదూ? రా...శ్రీని! ఒక్కసారి మిత్రుణ్ణి బిగిగా కౌగలించుకోనీ శ్రీనీ...!"

అంటూ మరో రెండడుగులు ముందుకు వేసి నన్నందుకోబోయాడు. నేను తప్పించుకోడానికి ప్రయత్నించి విఫలుణ్ణయిపోయాను.

వాడు నన్ను గట్టిగా పట్టుకున్నాడు. వాడి కౌగిల్లో ఉక్కిరి బిక్కిరవుతుంది. కండరాలు మెలివేసి పిండినట్టవుతుంది. ఊపిరాడటం లేదు.

నేను చనిపోతున్నానా? ఈ రాక్షసుడు నాపీక నులిమి చంపడానికి ప్రయత్నిస్తూన్నాడా? అప్పటి పగ ఈ రూపంలో తీర్చుకుంటూన్నాడా?

సహాయంకోసం గట్టిగా కేకలు వేస్తూనే వున్నాను. అవి నా గొంతునుండి బయటకు రావడంలేదు. నోరు పెగలడం లేదు.

శంతన్‌రావు పెద్దగా నవ్వాడు.

ఆ నవ్వుకి నా గది పెద్ద శబ్దంచేస్తూ బ్రద్దలై తుత్తునియలైనట్లయింది. పెద్ద సుడిగాలి రేగి నన్ను బలంగా ఆకాశంలోకి విసరినట్లయింది! గాలిలో ఎటో ఎక్కడికో తేలిపోతూన్నట్లు వుంది.

హోరున ఘోషించే సముద్రాలు...కట్టలు తెంచుకు పొర్లి పొంగే నదులు, పర్వతాలు, కొండలు, కోనలు అన్నీ నా కాళ్ళ క్రిందుగా పరుగెత్తుతున్నాయి. కళ్ళు గిర గిరా తిరిగిపోతూన్నాయి. స్పృహ తప్పిపోతూన్నట్లు వుంది. అలానే గాలిలో స్పృహతప్పి పడిపోయాను.

కొన్ని క్షణాలకు ఎవరో నేల మీదకు విసరివేసినట్లయి కళ్లు తెరిచాను. నేను నేల మీద వున్నాను. నా గది లేదు. అంతా కొత్త ప్రదేశం. మహారణ్య మధ్యంలో, పాడుపడిపోయిన పట్టణంలా వుంది అది.

కూలిపోయిన భవంతులు, ఎటు చూచినా పెద్ద పెద్ద కూలిపోయిన భవంతులు, గోతులుపడి శిథిలమైన రోడ్ల మీద కూలిపోయిన భవంతుల తాలూకు గోడ పెల్లలు, యిటుక ముక్కలు, పెంకు కుప్పలు, ఎండిపోయి, కాలిపోయి నేలకు వరిగిన వృక్షాలు...అంతా నిర్మానుష్యంగా వుందా ప్రదేశం!

నే నెక్కడున్నాను! నన్నెందు కిక్కడకు తీసుకొచ్చాడు? శంతన్ మళ్ళీ కనిపించడేం?

ఈ పట్టణం అంతా కాలిపోయి నాశనమైందా? వరదపాలై శిథిలమైందా? అసలి దే పట్టణమో? మహారణ్య మధ్యంలో ఎలా వెలసిందో? ఒక్క మనిషీ కనిపించడే? ఒక పిట్ట కూడా పలకడేం! చిన్న ఆకు కూడా కదలదేం?

నేను కలలో నడిచినట్టే నడుస్తూన్నాను ఆ వీధుల్లో! అక్కడక్కడ యింకా శిథిలమైన భవంతుల గోడలు యిటుకలు నేల మీద రాలుతూ శబ్దం చేస్తూనే వున్నాయి. అక్కడక్కడ భూకంపం వచ్చినట్టు భూమి చలించి, బీటలు తేలి, భవంతులు లోనికి కూలి పోతున్నాయి! పెంకులు ప్రేలి చెల్లా చెదురై ఆకాశం లోకి ఎగిరి నేల మీద పడుతూన్నాయి.

నేను జీవచ్ఛవంలా అలా నే రోడ్డుమీద నడుస్తూన్నాను. ఏదో తెలియని శక్తి నన్ను అలా నడిపిస్తూంది. అలా ముందుకు త్రోసుకుపోతోంది!

"శ్రీనీ! యిటు-యిటు శ్రీనీ!! యిటు తిరుగు!" నా భుజంమీద ఎవరో చెయ్యి వేసి ప్రక్కకి త్రిప్పినట్టయింది.

అటు వైపుకి నడచాను. తిన్నగా ఒక భవంతి లోనికి నడిచాను. ఆ శిథిలమైన భవంతి పైనుంచి ఇటుకలు, పెంకులు అప్పుడప్పుడూ రాలుతూన్నాయి.

వరండాలోకి రాగానే ఎవరో చంటి కుర్రాడు పడినట్టు వినిపించింది. ఊరికే గుక్క త్రిప్పుకోకుండా ఏడుపు వినిపిస్తూంది గదిలోనుంచి. గదులు ప్రతిధ్వనిస్తూన్నాయి. ఊరికే ఒకటే ఏడుపు !

ఎక్కడ? ఎక్కడా ఏడ్పేది?

ఎక్కడా ఏమీ కనిపించదేం? ఎవరు ఆ ఏడ్పేది?

వరండాలో కొచ్చినా ఆ శబ్దం తగ్గలేదు. దానితోపాటుగా యింకా ఏవేవో వింత వింత శబ్దాలు భయంకరంగా వినిపించడం మొదలుపెట్టాయి. ఒకటే గోల. చెవులు చిల్లులు పడేలా ఒకటే రొద.

వరండాపైన వున్న మేడ మీద ఎవరో అటూ యిటూ పరుగెత్తుతున్న శబ్దం కాలి మువ్వల పట్టీలు కదలిన శబ్దం వినిపిస్తూంది. వెక్కి వెక్కి ఏడుస్తూన్న శబ్దమూ వినిపిస్తూంది.

ఎక్కడి దా శబ్దం? ఎవరా ఏడ్పేది?

ఇంతలోనే ఆ మేడ మెట్లమీదనుంచి ఒక కూజా బిందె దొర్లుకూ వచ్చి వరండాలో పడ్డది. క్రింద పడగానే అది ముక్కలు ముక్కలై చెదరిపోయింది. ఎక్కడనుండో పూలతో నిండిన వెండి పూసజ్జ విసురుగా వచ్చి నా పాదాల ముందు పడ్డది. దానిలో పూలన్నీ చెల్లాచెదరయి విరజిమ్మబడ్డాయి.

నా గుండె ఝల్లుమంది. హృదయంలో ఎవరో బలంగా పొడిచినట్టయింది.

"ఎక్కడి దిది? ఇక్కడికెలా వచ్చింది? దీన్నెవరు తెచ్చారు యిక్కడకు? ఇది శాంత, పూజకు పూలు కోసుకొనేది!

దాన్ని తీసి చేత్తో పట్టుకుని త్వర త్వరగా మెట్లెక్కి మేడపైకి వచ్చాను.

పైన పొడుగాటి హాలు వుంది. కనుచూపు మేర వరకు పొడుగ్గా కనిపిస్తుం దా హాలు. రెండు ప్రక్కలా శిథిలమైన గదులు వున్నాయి.

ఆ గదిలోనుంచి ఎవరో స్త్రీ ఏడుస్తూన్నట్టు వినిపిస్తుంది. వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు వినిపిస్తూంది సన్నగా ...కాలి అందెల చప్పుడు నా ముందునుంచి నడుస్తూన్నట్టు వినిపిస్తూంది......

కనుచూపు మేరలో ఎవరో స్త్రీ ఆకారం అస్పష్టంగా కనిపిస్తున్నట్టు కనిపించింది. తల విరబోసుకుని వుంది.

అలావుందే ఆమె? అస లెవ రామె?

వడి వడిగా అక్కడకు పరుగెత్తాను.

ఎవరది...?

ఉలిక్కి పడ్డాను.

శాంత...! నా శాంత!

ఇక్కడి కెందు కొచ్చింది? ఎలా వచ్చింది ఇలా వుందే...?

ఆతురతగా వెళ్ళి చెయ్యపట్టుకోబోయాను-కానీ నా చేతులకేమీ తగలలేదు. మళ్లీ అక్కడేమీ కనిపించలేదు. అంతర్ధానమైంది! ఆ అందెల మ్రోత పరుగెత్తి మరో గదిలో కెళ్ళినట్టయింది. ఆ గదిలోకి పరుగెత్తాను.

శాంత అక్కడే నిలబడి వుంది. నాకేసి చూస్తోంది. అలా చూస్తూందేం? కళ్లు అలా కళావిహీ

నంగా మారిపోయాయేం? నిగ నిగా మెరిసే బంగారు చెక్కిళ్లు అలా మాడిపోయే వున్నాయేం? పెదాలు అలా కంపించి పోతూన్నాయేం? కన్నీరు అలా కారుతోందేం?

శాంతను ఎవ రిక్కడకు తీసుకొచ్చారు?

శంతన్‌రావు తీసుకొచ్చాడా? ఘాతుకుడనిపించాడేం? ఆతురతగా వెళ్లి శాంతను గట్టిగా పట్టుకున్నాను.

గట్టిగా, శిలలా తగిలింది !

పలుక దేం శాంత? ఇలా శిల అయిపోయిందేం? ఇది కలా? భ్రమా? వాస్తవమా? ఏమీ అర్థంకాదేం?

దాన్ని గట్టిగా వూపాను. అది గచ్చు మీద పడి పింగాణి బొమ్మ పగిలినట్లు శబ్దమై పగిలిపోయింది.

దీనితోపాటుగా నే పెద్ద అట్టహాసం వినిపించింది. ఆ వరండా అంతా మారుమ్రోగింది.

శంతన్...! శంతన్‌రావు మళ్ళీ కనిపించాడు ! మిత్రద్రోహి! వాడు నావంకే చూచి నవ్వుతూన్నాడు; నాకేసే చూసి హేళనగా నవ్వుతూన్నాడు. నా హృదయం మండిపోయింది. కోపం ముంచుకొచ్చింది. అక్కడే నా ప్రక్కనే శిథిలమై పడివున్న కిటికీ వూచ లాగి, రెండు చేతులతోనూ పట్టుకుని బలంగా వాడి మీదకు విసిరాను.

కాని వాడు అంతర్ధానమయ్యాడు.

నేను ఆ విసురుకు ఆగలేక పట్టు తప్పిపోయి, ఆ మేడమీదనుంచి క్రిందకు పడ్డాను. ఆ పడటంలో నా తల ఒక బండరాతిమీద పడి తునాతునకలైంది.

ఉలిక్కిపడి లేచి కూర్చుండిపోయాను.

బాగా తేరుకున్న తరువాత చుట్టూ కలయ చూచాను.

నేను నాగదిలో మంచంమీదనే వున్నాను...! అక్కడి పాడుబడ్డ పట్టణం లేదు. ఆ శిథిలమైన భవంతులూ లేవు...శంతన్ లేడు...! అంతా శూన్యం...!!

అప్పటికి బాగా తెల్లవారినట్టుంది. రంగుటద్దాల వెంటిలేటర్సులోనుంచి, రంగు రంగుల కాంతి నా గదిలో పడుతోంది.

అప్పుడే గది తలుపు త్రోసుకుని అమ్మ ప్రవేశించింది లోపలకి.

"ఏం శ్రీనివాసరావు-ఈ వేళ యింతసేపు నిద్రపోయావేం...?" అంది అమ్మ నవ్వుతూ.

నేను మరికొన్ని క్షణాలకుగాని వాస్తవిక ప్రపంచంలో పడలేదు- యిప్పుడు జరిగింది కలా...? ఎంత ఘోరమైన కల...?

నాలో యింకా ఆ కల తాలూకూ దృశ్యాలు చెదరిపోలేదు. ఇంకా కళ్లకు కట్టినట్టే కనిపిస్తున్నాయి. అవే నాముందు యింక జరుగుతున్నట్లు వుంది.

నేను యింకా వెర్రిగా చూడ్డం అమ్మ కనిపెట్టినట్టుంది.

"అలా వెర్రిగా చూస్తూన్నావేం శ్రీని...! నిద్రలో కూడా ఉలిక్కిపడి లేచావు- ఏదయినా పీడకల కన్నావా...?" అంది అమ్మ దగ్గరకు వస్తూ.

పీడ కల? ఎంత ఘోరమైన కల...? ఆమెకేం తెలుసు నే నిప్పుడెంత ఘోరమయిన పీడ కలగన్నానో...?

నే నేమీ మాటాడకుండా మంచం మీదనుంచి దిగాను.

ముందు క్రిందకెళ్ళి శాంతను చూడాలి. శాంతను చూచేవరకు నా మనస్సెందుకో ఆందోళనగా వుంది. నా మనస్సెందుకో బాధగా వుంది.

మెట్లు దిగుతూ అన్నాను:

"శాంత కెలాగుంది? జ్వరం జారిందా?"

అమ్మకూడా నా వెనకాలే మెట్లు దిగుతూంది.

"ఏం జరడమో! ఒక రాత్రికడ హెచ్చింది కొద్దిగా! రాత్రల్లా ఏవో కలవరింతలు! ఊరికే ఉలిక్కిపడేది...చంటివాడయితే ఒకటే ఏడుపు—అసలు నిన్ను లేపుదామనుకున్నాను...మళ్లా నిద్రలో వుంటావని లేపలేదు." అంటూ అమ్మ మెట్లు దిగి వెళ్ళిపోయింది—నేను ఆతురతగా శాంత గదిలోకి వెళ్ళాను.

శాంత యింకా పడుకున్నట్టే వుంది. పచ్చటి శరీరం రక్తహీనమై తెల్లగా పాలిపోయినట్టు కనిపిస్తూంది. చంటివాడు ప్రక్కలో తెల్ల గుడ్డల్లో కలసిపోయి పిండిబొమ్మలా కనిపిస్తున్నాడు. వాడి వయస్సు ఇవ్వాల్టికి పదిహేను రోజులు మాత్రమే.

నేను వెళ్ళగానే శాంత లేచింది మంచం మీదనుంచి. కళ్ళు చాలా నిస్సత్తువుగా గోచరిస్తున్నాయి. పాలిపోయిన ముఖం మీద చిరునవ్వు మొలిచింది.

"ఈ వేళ యింత ప్రొద్దెక్కిందే?" అంది శాంత పేలవంగా నవ్వుతూ. నాకెందుకో నవ్వు రాలేదు.

రాత్రి కలలో దృశ్యాలే గుర్తుకొస్తున్నాయి శాంతను చూస్తుంటే—అసలిటువంటి పాడు కల యెందుకొచ్చింది ?

"ఎలా వుంది శాంతా? జ్వరం జారిందా ?" అంటూ ప్రక్కలో కూర్చుని వంటిమీద చెయ్యి వేసి చూచాను. అప్పటికి జ్వరం ఏమీ లేదు.

ఏదో ఊహిస్తూ—శాంత కళ్ళల్లోకి వూరికే చూస్తుంటే తెల్లబోయింది శాంత. ఎందుకో అలా చూడాలనిపించింది నాకు.

"ఏం? అలా చూస్తున్నారేం! కొత్తగా కనిపిస్తున్నానా ఈ రోజు!" పాలిపోయిన చెక్కిళ్ళు చొట్టలు పడేలా నవ్వింది శాంత.

వెంటనే కోలుకొని దృష్టిని మరల్చాను.

"ఏమీ లేదు-ఊరికినే!" అంటూ బయటకొచ్చేశాను ముఖం కడుక్కుందుకు.

భోజనం అయిన తరువాత పది గంటలకు ఆఫీసుకెళ్ళాను. ఆఫీసులో కూడా నా మనస్సు సరిగా లేదు. కలత కలతగా వుంది. రాత్రి కలలో నేను చూచిన దృశ్యాలు మర్చిపోలేకుండా వున్నాను. పదేపదే అవే దృశ్యాలు నాకళ్ళముందు తిరిగేవి. ఏ కాగితం తిరగేస్తూన్నా, ఏ ఫైలు చూస్తూన్నా అందులో శంతన్‌రావు కనిపించేవాడు. అవే దృశ్యాలు......ఆ పాడుపడిన పట్టణం...శిథిలమైన భవంతులు...ఆ ఆర్తనాదాలు... ఆ పైశాచిక చర్యలు... అవే కనిపిస్తూండేవి.

అసలిటువంటి కల ఎందుకొచ్చింది? ఈ పాడు కల అర్థమేమిటి? అసలు శంతన్‌రావు ఏమయినట్టు? బ్రతికే వున్నాడా? లేక చనిపోయాడన్న పుకారు నిజమేనా?

ఏనాటి శంతన్‌రావు—? అయిదేళ్ళక్రితం వూరు వదలిపోయిన శంతన్‌రావు మళ్ళీ తిరిగి రాలేదు. ఏమయ్యాడు? ఎటుపోయాడు? అసలింతకీ వాడు వూరు వదలి ఎందుకు పోయాడు?

చిన్నప్పుడు వీధిబళ్లో అక్షరాలు దిద్దుకుంటున్న దగ్గరనుంచి మొన్న మొన్నటివరకూ నేను వాణ్ణి బాగా ఎరుగుదును. నాతోపాటుగా కాలేజీలో చేరి ఒక సంవత్సరం మాత్రం చదివి ప్రిన్సిపాల్‌తో పోట్లాట పెట్టుకుని చదువుకి తిలోదకాలు వదులుకున్నాడు.

శంతన్‌రావు నిజంగా చెయ్యెత్తు మనిషి. చూట్టానికి మనిషి గంభీరంగా వుండేవాడు. ముఖంనిండా స్ఫోటకపు మచ్చలుండేవి. ఎప్పుడూ ఏదో క్రూరంగా ఆలోచిస్తూన్నట్టు వుండేది వాడి ముఖం. వాడి పనుల్లో ఆలోచనల్లో అలా క్రూరత్వం, నీచత్వం గోచరించేది. కొందరు వ్యక్తులు పుట్టి ఉత్త పాపకార్యాలు చెయ్యడానికే జీవిస్తూన్నట్టు అనిపిస్తుంది వాణ్ని చూస్తుంటే.

కానీ నాకు వాడి విషయంలో బాగా ఆశ్చర్యం కలిగించింది, నా మనస్సును అతిగా బాధపరచింది ఒకనాటి సంఘటన: బహుశ అదే వాడు పరారీ అవడానికి కారణమైందేమోనని అనుకుంటూవుంటాను, అప్పుడప్పుడు.

ఒకనాటి శీతాకాలపు రాత్రి మేడమీద గదిలో పన్నెండుగంటలవరకూ చదువుకుంటూనే వున్నాను. అప్పటికి నేనింకా కాలేజీ వదలలేదు. కాస్త విశ్రాంతి కోసమని చదువు ఆపుచేసి గదిబయట వరండాలో అటూ యిటూ తిరగడం మొదలుపెట్టాను. అక్కడనుంచి చూస్తే దూరంగా సముద్రం కనిపిస్తూంటుంది. బయట ప్రకృతి అంతా ప్రశాంతంగా వుంది. అరవిచ్చిన బీరపువ్వులా వెన్నెల కాస్తూంది. రోడ్డుమీద చెట్లనీడల్లో తప్ప అంతటా వెన్నెల పూత పూసినట్టు వుంది. రోడ్లమీద జనసంచారం ఏమీ లేదు. ఆ ప్రదేశం వూరికి చివర అవడంవల్ల, అక్కడ ఎక్కువగా సంసారాలు చేసే యిళ్ళకన్నా ఆఫీసులు అవి వుండటంవల్ల జనసంచారం 9 గంటలకే సన్నగిల్లిపోతుంది. 10 గంటలు దాటితే సర్వసాధారణంగా ఎవరూ కనిపించరు రోడ్డుమీద. అయిదు నిమిషాలవరకూ అక్కడే అటూ యిటూ తిరిగి మళ్లీ గదిలోకొచ్చి చదువుకి ఉపక్రమించాను. పుస్తకం తెరచానో లేదో ఎక్కడనుంచో సన్నగా కెవ్వుమని స్త్రీ కంఠస్వరం వినిపించగానే ఉలిక్కిపడ్డాను. వెంటనే మరో రెండు మూడు క్షణాల్లో అదే స్వరం మళ్ళీ వినిపించింది. వెంటనే పుస్తకం మూసి మళ్లీ వరండాలోకొచ్చి నిలబడి చూచాను, మరేమయినా వినిపిస్తుందేమోనని. మళ్లీ ఆ కేక వినిపించింది. పెనుగులాడుతున్నట్టు. ఇంకా ఏవో అస్పష్టంగా తడబడుతున్న మాటలు వినిపించాయి.

గుండెలు ఝల్లుమన్నాయి.

అది సమీపంలోనే ఉన్న శివాలయం ప్రాంతం నుంచి వస్తున్నట్టు వినిపిస్తోంది. మా యింటికి ఫర్లాంగు

దూరంవుంది శివాలయం. దానితో కలిసే ఆ ఆలయం అర్చకుడు ఉండే యిల్లుకూడా వుంది. దాని చుట్టూ పచ్చగన్నేరుచెట్లు గుబురుగా పెరిగివుండడంవల్ల అక్కడేమి జరిగేదీ కనిపించడంలేదు. కేకలుమాత్రం అక్కడనుంచే వస్తున్నాయి.

అక్కడే ఏదో అఘాయిత్యం జరుగుతుంటుందని ఊహించాను. నాలోని ఉడుకురక్తం పొంగింది. ఆ శివాలయాన్ని, ఆ యింటిని తలచుకోగానే ఏదో గుర్తొచ్చినట్టయి ఇక అక్కడ ఒక క్షణంకూడా ఆలస్యం చెయ్యకుండా బీరువాలోని టార్చిలైటు తీసుకుని మేడ దిగి రోడ్డుమీద కొచ్చాను.

ఇంకా మరో నలుగుర్ని సహాయంకోసం పిలుద్దామన్నా ఇళ్ళు దూరం కావడంవల్ల వాళ్ళు లేచి వచ్చేసరికి ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో మరేదయినా ప్రమాదం కలిగే పరిస్థితి కనిపిస్తే అక్కడనుంచే గట్టిగా కేకలు వెయ్యవచ్చని, ఒక్కణ్ణే అక్కడకు బయలు దేరాను.

నేను శివాలయ సమీపంలోకి చేరుకునేలోపులోనే ఒకామె కేకలేస్తూ కంగారుగా రోడ్డుకడ్డంగా పరుగెత్తుకొచ్చింది. ఆమె వెనకాలే విసురుగా వచ్చే బాణంలా ఒక వ్యక్తి పరుగెత్తుకొచ్చాడు ఆమెను పట్టుకోడానికనుకుంటా.

నన్ను చూడగానే ఆమె భయంతో నా వెనక్కాల కొచ్చేసింది. ఆ విసురుగా వచ్చే వ్యక్తి ఉలిక్కిపడి ఆగిపోయాడు ఎటూ కదల్లేక. ఆమెను నేను వెంటనే గుర్తుపట్టాను. అయితే అతను చెట్టు నీడలో వుండటంవల్ల వెంటనే గుర్తుపట్టలేకపోయాను. వెంటనే టార్చిలైటు అతని ముఖంమ్మీదవేసి నిర్ఘాంతపోయాను—!

“శంతన్...!”

లైటు వెయ్యగానే ముఖం కనిపించకుండా దాచుకుని వెనక్కి పరుగెత్తడానికి ప్రయత్నించే వాడల్లా నా కంఠస్వరం విని, కాళ్లకు సంకెళ్లు పడ్డట్టు నిలబడిపోయాడు తలవంచుకుని. నేను అమితంగా ఆశ్చర్యపోయింది ఏమిటంటే ఆ వ్యక్తి శంతన్ అయి వుంటాడని నేను ఏనాడూ ఊహించి వుండలేదు.

శంతన్ దగ్గరగా వెళ్లాను. వాడు ఊరికేవణికిపోతున్నాడు. తల అంతా రేగి, జుట్టు ముఖంమ్మీద పడి కళ్లను, ముఖాన్ని సగంవరకు కప్పి అతివికృతంగా కనిపిస్తున్నాడు. చొక్కా అక్కడక్కడా చిరిగివుంది. ముఖంమీద, గోటితోగిల్లిన గాయాల్లో నుంచి రక్తంచిందుతూంది. కుడికంటికి దెబ్బతగలటం వల్లేమో, బాగా లావుగా వాచి, సగం మూసుకుపోయి వూరికే నీరు కారుతోంది! ముంజేతిమీద కొరికిన గాయంతాలూకు కండ పైకితేలి ఎర్రగా కనిపిస్తూంది....

ఆమెకూడా ఊరికే ఆపాదమస్తకం కంపించిపోతోంది. చేతిగాజులు చిట్లి అక్కడక్కడ చీరుకుపోయి రక్తం చిమ్ముతూన్నాయి. వూరికే ఏడవడంవల్లేమో ముఖం అంతా వాచివుంది.

శంతన్మాత్రం తల ఎత్తలేదు. భూమిలోకి వంచుకుని నిలబడిపోయాడు.

ఆక్షణంలో వాణ్ణి ఏమి చెయ్యాలో, ఏమనాలో కూడా అర్థంకాలేదు. శంతన్ ఎంత దుర్మార్గుడైనా యిటువంటి అఘాయిత్యం, మీదు మిక్కిలి మిత్రద్రోహం తలపెడతాడని కలలోకూడా అనుకోలేదు.

“ఏవిఁటి శంతన్...! ఏమిటీ పని...!”

వాడి తల వెంట్రుకలు పట్టి పైకిలేపి వాడి ముఖంలోకి చూస్తూ అడిగాను. కాని సమాధానం శూన్యం. తల మళ్లీ భూమిలోకి క్రుంగిపోయింది.”

“ఇంత మిత్రద్రోహం...! ఇంత దారుణం...! ఆమె ఎవరో, ముందుముందు ఎవరికి సహధర్మచారిణి కాబోతుందో నీకు తెలియంది కాదు! నిలో యిటువంటి దుర్మార్గం వుందని కల్లోకూడా అనుకోలేదు!”

నేను ఎన్ని అన్నా వాడు సమాధానం చెప్పేలా లేదు. ఆస్థితి మించిపోయింది. కోపం, అభిమానం, అవమానం మిళితమై వాడిముఖంలో నుంచి ఒక్కుమ్మడిగా వెదజిమ్ముతున్నాయి. “ఈ సమయంలో నాకు అడ్డుపడింది నువ్వు కాబట్టి బ్రతికి పోయావు ...!” అన్నట్టు వున్నాయి వాడిచూపులు.

అయితే ఆ సమయంలో నలుగుర్నీ లేపి వాడి పరువు తీసి నానా చీవాట్లుపెట్టి రచ్చ కీడ్పించడం నాకిష్టంలేదు. మరో నాలుగు చీవాట్లుపెట్టి యిటువంటి దారుణాలు మరెప్పుడూ తలపెట్టకని చెప్పి మర్యాదగా యింటికెళ్లి పొమ్మన్నాను.

వాడేమనుకున్నాడో ఏమో వంచిన తల ఎత్తకుండానే గిరుక్కున తిరిగి చరచరా వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయేటప్పుడుమాత్రం దెబ్బతిని పగపట్టినపాములా మాత్రం ఒకసారి చూచి వెళ్ళిపోయాడు.

వాడు నావిషయంలో యిలా ప్రవర్తించడం యిదే మొదటిసారి! వాడిలో యిటువంటి వుద్దేశ్యం, పశుత్వం ఎందుకు ఉద్భవించాయో నాకర్థం కాలేదు. అప్పుడు అడ్డపడింది నేనుకాక మరెవరయినా అయి వుంటే పీకనులిమి దారుణంగా హత్యచేసేవాడేమో కూడా!

ఆమె మాత్రం యింకా వణుకుతునేవుంది. ఆ ఆందోళన యింకా పూర్తిగా తగ్గలేదు. చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తునే వుంది.

ఆమెను వూరడించి ధైర్యం చెప్పాను.

ఆమె ద్వారా ఇతర వివరాలు తెలుసుకుంటే తేలిన వివరాలు ఏమిటంటే, యింట్లో వుంది ఆమె. మరో చిన్నపిల్ల తప్ప ఎవరూ లేరని. ఆమె తండ్రి పొరుగూరుకు వెళ్ళాడని నాకు యిదివరకే తెలుసు. అతను వెళ్ళేటప్పుడు కూడా నాతో చెప్పి వెళ్ళాడు. అయితే తల్లి లేకుండా పిల్లల్ని ఒక్కళ్ళనే యింట్లో వదలి వెళ్ళాల్సిన అవసరము ఏం కలిగిందో నాకర్థం కాలేదు.

"మరి మీ అమ్మగారు కూడా వెళ్ళారా మీ నాన్నతో?" అన్నాను.

"లేదు, యివాళ మధ్యాహ్నమే బాబాయి వచ్చాడు, పిన్నికి మరీ ఎక్కువగా వుందంటూ తీసుకెళ్ళాడు. అమ్మ మళ్ళీ రాత్రికే వస్తానంటూ వెళ్లింది ...యింతవరకూ రాలేదు.

నేను విషయం గ్రహించాను.

"పోనీ మీరు ఒంటరిగా పడుకునేపోతే మా యింటికెందుకు రాలేదు...కనీసం ఈ విషయం నాకు తెలిసినా తోడుగా ఎవరినైనా పంపేవాణ్ని!"

ఆమె ఏమీ మాట్లాడలేదు. ఆమెను యింకా ఏ విధమైన ప్రశ్నలు వేసి బాధపెట్టదలచలేదు. వెంటనే వాళ్ళ యింటికెళ్ళి నిద్రపోతూన్న చంటిపిల్లను లేపుకుని భుజంమీద వేసుకుని యింటికి తీసుకొచ్చాను యిద్దర్నీ.

అమ్మను లేపి విషయాన్ని కొంచం మార్చి చెప్పాను. ఎవరో దొంగలు మెడలో హారం తెంపడానికి ప్రయత్నించారని కేకలు వినిపిస్తే నేను వెళ్ళి విడిపించానని, వాళ్ళు కనిపించకుండా పారిపోయారని కల్పించి చెప్పాను...ఇప్పుడు జరిగిన సంఘటన గాని, అందులో వ్యక్తిని గాని ఏ పరిస్థితులలోనూ బయట పెట్టవద్దని ఆమెదగ్గర వాగ్దానం తీసుకున్నాను...!

అమ్మ చాలా నొచ్చుకుంది. వాళ్లెవళ్లో దొరికి నట్టయితే ఉరి తీయొద్దునంది. ఒంటరిగా వదలి వెళ్లినందుకు వాళ్ల అమ్మను నిందించింది. వాళ్లను అమ్మ తన గదిలోకి తీసుకుపోయి పడుకోబెట్టింది. నేను మేడ మీదకు వచ్చేశాను—

అంతే! అదే కనిపించడం శంతన్‌రావు. అప్పటి నుండి ఇప్పటివరకు వాడు మళ్లీ ఈ పరిసరాలలోనే కనిపించలేదు.

ఎందుకు వెళ్ళిపోయాడు శంతన్. వాడి అభిమానం దెబ్బతిన్నదా? తిరిగి నాకు, శాంతకు ముఖం చూపించడానికి బిడియపడ్డాడా? వాడిలో వున్న రాక్షసతత్వం రేగి వాణ్ని అలా బుద్ధిహీనంగా ప్రవర్తింపచేసిందా? ఆమె నాకు కాబోయే సహధర్మచారిణి అని తెలిసికూడా, ఎందుకంత సాహసం చెయ్యబోయాడు?

ఏమో—ఏది ఎట్లాగున్నా ఆమెమాత్రం శాశ్వతంగా మా యింట్లోనే ఉండిపోయింది ... ఆమె శాంత.

అయితే శంతన్ ఏమయినట్లు...?

బ్రతికివున్నాడా? చనిపోయాడా...అస లెక్కడకుపోయాడో?

రాత్రి కలలో మళ్లీ శంతన్‌రావును చూడగానే నాలో గత స్మృతులు ఊరికే తిరగనారంభించాయి. వాడినుంచి మనస్సు ఎంత మళ్లిద్దామన్నా అలా చెయ్యలేకపోతున్నాను. అవే దృశ్యాలు ... ఆ పాడుబడ్డ పట్టణం! అభివంతులు...అందులో శాంత! ఎంత మర్చిపోదామన్నా సాధ్యం కాకుండావుంది. ఏదో బలవత్తరమైన శక్తి అటువైపుకే నన్ను త్రిప్పుకుంటూంది. పదే పదే గుర్తుకు తెస్తూ నా గుండెను పిండివేస్తుంది.

శంతన్ చనిపోయి నిజంగా భూతం అయ్యాడా? ఇది తలచుకోగానే నా వళ్ళు ఝల్లుమనేది. ఏదో ఊహించరాని ఆలోచనలు నా దృష్టిపథంలో తిరిగేవి. ప్రతీ ఊహలో ఏదో అపశకునం గోచరించేది.

ఏకాంతంగా కూర్చుంటే ఇటువంటి ఆలోచనలే రేగుతుంటాయి. అందుకని ఎవరయినా మిత్రులతో కాలక్షేప తప్పం మరేమీ మార్గం కనిపించలేదు...

మధ్యదారిలో వకీలు మణి శేఖరం కనిపించాడు. వాడితోపాటుగా శర్మ ఉన్నాడు—

"ఏం శ్రీనీ! ఎక్కడికో బయలుదేరావు!" అన్నాడు మణి.

"అదే ఆలోచిస్తున్నాను!"

"దానికి ఆలోచనేమిటి యింత పట్టణంవుంది.!" అంటూ నవ్వాడు శర్మ.

"అలా సముద్రం కేసిపోదాం." అన్నాను నేను. ఇద్దరూ నవ్వారు.

"పాడు సముద్రం—అక్కడేముందని హోరుమంటూ రొద తప్ప మన క్లబ్బులో ఈ వేళ మంచి ప్రోగ్రాం వుంది. ప్రొఫెసర్ నారాయణగారి మ్యాజిక్ ప్రోగ్రాం...! అక్కడకు పోదాం పద...!"

ఎక్కడో అక్కడ నాకు కాలక్షేపం, కాలం గడవడం ముఖ్యం. అందుకని వాళ్ళు చెప్పినదానికేమీ అడ్డుచెప్పలేదు. ప్రొఫెసర్ నారాయణగారి మ్యాజిక్ ప్రోగ్రాం నాకేమీ కొత్తకాదు. ఒకసారి చదివేసిన చెత్తపుస్తకాన్ని విధిలేక మళ్ళీ చదువుతున్నట్టు వుంటుంది ఆయన ప్రోగ్రాం చూస్తూంటే.

క్లబ్బులో ఒక పెద్దహాల్లో మ్యాజిక్ ప్రదర్శనం జరుగుతోంది. ఏదో పేకముక్కలగారడీ, టోపీలో నుంచి పావురాళ్ళను తీయడం, కళ్ళకు గంతలుకట్టుకుని బోర్డుమీద వేసిన అంకెలుకూడి లెఖ చెయ్యడం...యిలా ఏవోవోజరుగుతున్నాయి. ఆయనచేసిన వేచేస్తూన్నా ఎప్పుడూ చూచేవాళ్ళే విరగబడి చప్పట్లుకొడుతూన్నారు. కొందరుమాత్రం గదులలో పింగ్‌పాంగ్, చస్, పేకలో పడిపోయారు. ఆరుబయట పెద్దపెద్దలైట్లు అమర్చిన కోర్టులో టెన్నీస్ ఆడుతున్నారు కొందరు. రేడియోగ్రాంచుట్టూ సోఫాలలో పడుకుని తియ్యని సంగీతంవింటూ సిగరెట్లు తగలేస్తున్నారు కొందరు— యివేవీ పట్టించుకోకుండా కాంటీన్‌లో ఆమ్లెట్లు మెక్కుతున్నారు కొందరు.

"—వాట్...! మిష్టర్ శ్రీనివాసరావు! నీకు పుత్రోదయ మయిందటగా!" చెప్పావుకావు—కంగ్రాట్యులేషన్స్...! పార్టీ ఎప్పుడు...?"

అనుకోకుండా అయిన ఈ 'శబ్దా'నికి నేను కంగారుపడ్డాను. ఎదురుగా చూస్తే, మిస్. సౌదామిని నిలబడివుంది నవ్వుతూ! బొద్దుగా బలిసిన చేతివేళ్ళకు హేండ్‌బాగ్ బెల్టును వయ్యారంగా చుట్టుకుంటూంది.

అంతమందిలోనూ అట్టహాసంగా అడిగినందుకు నేను సిగ్గుపడ్డాను. అప్పుడే కొందరు చేతిరుమాళ్ళు నోటికి అడ్డుపెట్టుకున్నారు.

ఆవిడ కాలేజీలో ట్యూటర్ చేస్తూంది. ఆడవాళ్ళతోకంటే మగవాళ్ళతోటే ఎక్కువ చనువుగా వుంటుంది. ఎంచేతనో ముప్పయిఏళ్ళు వచ్చినా పెళ్లి చేసుకోలేదు. తెల్లగా, బొద్దుగా అరటిదువ్వలా క్రిందికి మీదకి ఒకేపరిమాణంలో వుంటుంది.

వెంటనే ఏం సమాధానం చెప్పాలో తేలీక నవ్వి ఊరుకున్నాము. ఇంతలోనే పింగ్‌పాంగ్ ఆడే గదిలో నుంచి రఘు బయటపడ్డాడు. నన్ను చూచి ఆమె అడిగిన ప్రశ్న ఎక్కడనుంచి విన్నాడో ఏమో.

"పుత్రోదయ మయింది వాడికికాదు మేడం! వాడిసతీమణికి" అంటూ చిన్న 'జోక్' విసరాడు రఘు.

ఆమె ముఖం వెల వెలాపోయింది.

"ఏమో. మీరు డాక్టర్లు కాబట్టి మీకావిషయం బాగా తెలుస్తుంది! మాకేం తెలుసు లెండి!" అంటూ గమ్మత్తుగా నవ్వి, చేతిలో నాజూగ్గా పట్టుకున్న ఉల్లిపొరలాంటి రుమాలుతో ముఖంమీద పట్టిన చెమటను అద్దుకుంటూ అక్కడనుంచి చరచరా నడచి వెళ్ళిపోయింది ఆమె.

రఘు నవ్వాడు ఆమె వెళుతూన్నవైపుకే చూస్తూ.

రఘు నాకున్న మిత్రుల్లోకల్లా అతి సన్నిహితుడు, ముఖ్యుడు, పెద్ద డాక్టరు, పట్టాపుచ్చుకుని స్వంతంగా వైద్యం నిర్వహిస్తున్నాడు.

ఆమె క్లబ్బుదాటి వెళ్ళినతరువాత అన్నాడు రఘు.

"పిల్లలంటే అంత మోజుగా వున్నప్పుడు నిక్షేపంలా పెళ్లి చేసుకోగూడదూ? ఇంటినిండా కావల్సినంతమంది పిల్లలు పారాడుతుంటారు!"

"పోనీ నువ్వేపుణ్యం ఎందుకు కట్టుకోగూడదు. మీ రిద్దరూ జంటగా తగవులాడుకోవచ్చు ఎప్పుడూ?" అన్నాను నవ్వుతూ.

వాడు అట్టహాసంగా మాత్రం నవ్వి, మౌనంగా లెంపలు వేసుకుని, నా భుజంమీద చెయ్యివేసి అలా కేంటిన్‌హాలు వైపుకి తీసుకెళ్ళాడు.

కేంటిన్‌లో టేబుల్‌కి ఎదురుగా కూర్చున్నాం యిద్దరం. వాడు వేటికో ఆర్డరు యిచ్చాడు.

"మా శాంత కెలావుంది! బహుశ ఈపాటికి జ్వరం జారే వుంటుంది. నువ్వు ఆఫీసు కెళ్ళినప్పుడు యింటికొచ్చి చూచి యింజక్షను యిచ్చాను...మరేం ప్రమాదం లేదు!"

నే నేమీ మాట్లాడలేదు. శాంతమాట ఎత్తగానే ఎందుకో నా ఒళ్లు అప్రయత్నంగా ఝల్లుమంది. గుండె దడదడలాడింది. రాత్రి కలే సుర్తుకొచ్చింది. దాన్ని గురించి రఘుతో సంప్రతించాలనుకున్నాను. కానీ మళ్లీ అనవసరం అనిపించింది.

శాంత అన్నా, నే నన్నా అమితమైన అభిమానం, ప్రేమా వాడికి. కేంటిన్‌లో పని అవగానే గార్డెన్‌లోకి వెళ్లాము.

అక్కడ ఓ మూల సన్నజాజి పందిరిక్రింద కుర్చీలు, టేబులు వేసుకుని ప్రొఫెసర్ రాజశేఖరంగారు, రిటైర్డు తహసిల్‌దారు రమణమూర్తి, కాలేజీలో తెలుగు పండితులు అవధానిగారు, మొదలయినవాళ్లంతా పేకాటలోపడ్డారు. సన్నజాజి పందిరిలో అమర్చిన లైటు పున్నమచంద్రుడిలా వెలుగుతోంది. చల్లని వెలుగు వాళ్ల మీద చిమ్ముతోంది. వాళ్లకు ప్రక్కనే వేరే కుర్చీలో పోలీసు యినస్పెక్టరు రావుగారు కూర్చుని ఏదో డిటెక్టివులకి సంబంధించిన జర్నల్ తిరగేస్తూ మునిగివున్నాడు!

మేమిద్దరం అక్కడకు వెళ్లగానే ఆప్యాయంగా ఆహ్వానించారు అంతా. నన్ను కూడా ఒక చెయ్యి కలపమన్నారు రాజశేఖరంగారు. నాకు ఆటరాదు కాబట్టి నాబదులు తనే ఆడుతానన్నాడు రఘు.

వాళ్లు ఆటలోపడ్డారు, నేను, పోలీసు యినస్పెక్టరు రావుగారు కబుర్లలో పడ్డాము వాళ్లకి దూరంగా కూర్చుని.

సన్నజాజి పందిరిమీద నుంచి కమ్మని వాసన హాయి గొలుపుతోంది. రేడియోగ్రామ్‌నుంచి సన్నగా సంగీతం వినిపిస్తూంది. కేంటిన్‌లో వేస్తూన్న ఆమ్లెట్లు, కేకులతాలూకు వాసన ఘుమ్మంటూ కొడుతోంది.

రావుగారు తను నేరస్తుల్ని పట్టుకోడంలో చూపిన సాహసాలుగురించి చెప్పుకు పోతూన్నారు. వరుసగా. నేను పరధ్యాన్నంగా వింటూ కూర్చుండి పోయాను. నామనస్సు పరిపరి విధాలుగా పోతూంది. హృదయం ఎందుకో వుండీవుండి ఝల్లుమనేది. ఏదో అపశకునం గోచరించేది. తిరిగి మళ్లీ యింటికిపోవాలనిపించేది...శాంత కెలాగుందో..?

ఉన్నట్టవుండి యింతలోనే వర్షం ప్రారంభించింది. టపటపమని చినుకులు రాలుతోంటే వాటి కంటే వేగంగా, గార్డెన్సులోనుంచి క్లబ్బులోకి పరుగెత్తుతూన్నారు.

రాజశేఖరం యిత్యాదులు పేకముక్కలు మాత్రం ఏరుకుని కుర్చీలు అవి అక్కడే వదలి మళ్లీ క్లబ్బులోకి పరుగెత్తాడు. వాళ్లతో కలసి మేమూ లోపలికొచ్చేశాము.

అక్కడ వర్ష పుహోరుతోపాటు, రణగొణ ధ్వని ఎక్కువయింది. గార్డెన్సులోవాళ్లు, టెన్నిస్ ఆడే వాళ్లు అంతాలోపల కొచ్చేశారు.

వర్షం, గాలి ఎక్కువై గంట సేపటివరకూ ఏకధాటిగా కురిసి, తగ్గిపోయి, ముసురులోకి దిగి చిన్న చిన్న తుంపర పడటం మొదలు పెట్టింది.

రాత్రి తొమ్మిదైంది. ఈ వర్షం ముసురులోకి పంపింది కాబట్టి ఎలాగూ యిప్పటిలో వదిలేలా లేదు. "ఇక యింటికి పోదాం" అన్నాడు రఘు.

"కారు తెచ్చానుగా! నిన్ను యింటి దగ్గర దింపి శాంతను మరోసారి చూచి నేను యింటి కెళతాను" అన్నాడు రఘు.

సరే అని, అక్కడి మిత్రులతో చెప్పి బయలు దేరాము.

కారు, సిమెంటు రోడ్డుమీద మెత్తగా నడుస్తూంది; అక్కడక్కడ పల్లంలోనిలిచిన నీటిని చీల్చుకుంటూ పోతూంది...బజారుకి యిరుప్రక్కలా వున్న షాపుల్లోని రంగురంగుల లైట్లకాంతి వెనక్కు పరుగెత్తుతోంది. స్టీరింగ్‌దగ్గర రఘు కూర్చున్నాడు. వాడి ప్రక్కనే నేను కూర్చున్నాను. వాడు అద్దాలలో నుంచి దీక్షగా రోడ్డుకేసి చూస్తూన్నాడు.

వాణ్ణి యిందాకటినుంచి ఒక విషయం అడగాలనుకుంటున్నాను. అయితే వాడు ఏకాంతంగా చిక్కే అవకాశం యిప్పుడు చిక్కింది.

"చూడు రఘు.!" అన్నాను నెమ్మదిగా.

రోడ్డు వైపుకే దీక్షగా చూస్తూండే వాడల్లా నాకేసి తిరిగాడు ఏమిటన్నట్టు.

"శంతన్‌రావు జాడ నీ కేమయినా తెలిసిందా...? "వాడెక్కడున్నట్టు!" సందర్భం లేకుండా యిటువంటి ప్రశ్న ఎందుకు వేశానో వాడి కర్థం కాలేదు.

"ఇప్పుడా విషయం దేనికి...! వాడెందుకు గుర్తొచ్చాడు? వాడి విషయం ఏమన్నా తెలిసిందా..?" అన్నాడు రఘు నాకేసి చూస్తూ.

"లేదు - ఆ మధ్య వాడు ఎక్కడో ఒక పల్లెటూళ్లో పాడుబడ్డ శివాలయపు అరుగుమీద పడుకుని చనిపోయినట్టు విన్నాను...! కొందరు వెళ్లి చూచివాడు కాడనికూడా వాదించారు కదూ..? అసలు వాడేమయ్యాడో..?"

రఘు నవ్వాడు.

"వాడికి ఒక పల్లెటూళ్ళో, అందులో శివాలయంలో చనిపోయే యోగం పడుతుందంటావా శ్రీని! అటువంటి పవిత్రస్థలంలో ప్రాణాలు వదిలే పుణ్యం వాడికి పట్టదు. అటువంటి వాడికి ఏ వేశ్యావాటికలోనో, లేక ఏ పోలీసు ఆఫీసరు చేతిలోనో, చివరకు ఉరికంబం మీదనో రాసిపెట్టి వుంది చావు— వాణ్ణి గురించి నీకు తెలియంది కాదుగా!"

నేనేమీ మాటాడలేదు.

రఘు యింకా చెప్పుకు పోతున్నాడు.

"వాడు వూరు వదలిపోయిన దగ్గరనుంచి వాడి తండ్రి పరువు, ఈవూరు పరువు కాస్త చక్కబడ్డాయి కదూ?" అని కొన్ని క్షణాలు ఆగి మళ్ళీ అన్నాడు రఘు. "అయినా ఇప్పుడు అసందర్భంగా వాడెందుకు గుర్తొచ్చాడు నీకు?" అని నా ముఖంలోనికి చూచాడు.

"ఏమీలేదు, రాత్రి, వాడు భూతమయినట్టు ఒక విచిత్రమయిన కల వచ్చింది. అందుకు అడుగుతున్నాను" అన్నాను. దాన్నంతా వివరించకుండగా నే—

రఘు మళ్లీ అట్టహాసంగా నవ్వాడు.

"మంచికల! అటువంటి వాళ్లు చనిపోయినా, బ్రతికివున్నా పిశాచాలాంటి వాళ్ళే!" అన్నాడు.

శంతన్ అంటే వాడికీ పడదు. వాడు వూళ్ళో వున్నప్పుడుకూడా, రఘుకు మిత్రుడే అయినా వాణ్ణి చాలా అసహ్యించుకునేవాడు.

కారు రోడ్డు మలుపు తిరిగింది. తిరగడంలో ఎదురుగా రోడ్డుమీద నడచివచ్చే ఒక వ్యక్తి ముఖంమీద కారు లైటుపడి వెంటనే మాయమయింది. అతని ముఖంమీద మళ్ళీ చీకటి కప్పివేసింది. మా కారు ప్రక్కనుంచే దూసుకుపోయింది.

ఆ వ్యక్తిని చూడగానే గుండెలు ఝల్లుమన్నాయి. అతని ముఖంమీద లైటు పడగానే ఎవరో గుర్తొచ్చినట్టయింది. రాత్రి నేను కలలో చూచిన వ్యక్తి! పోలిక అలానే వుంది! యెవరై వుంటారు!

శంతన్ రావా...? శంతన్ తిరిగి వూరు కొచ్చాడా...?

ఏమో!!

వెనుకకు తిరిగి, అద్దంలోనుంచి చూచాను గాని, ఆ జనంలో మళ్ళీ కనిపించలేదు. రఘుని కారాపమందామనుకున్నాను గాని మళ్ళీ అది అవివేకమనిపించింది. ఏదో ఒక భయాన్ని...అవే సన్నివేశాల్ని మనస్సులో పెట్టుకుని పదే పదే తలంచుకుంటూంటే శూన్యంలో కూడా ఆ దృశ్యాలే కళ్ళకు కట్టినట్టు కనిపిస్తూ భ్రమింపజేస్తుంటాయేమో!

కారు ఒకే స్థాయిలో నడుస్తూంది. నే నింకేమీ మాటాడలేదు. అద్దంలో నుంచి బయటకు చూస్తుంటే చిన్న చిన్నగా పడే తుంపర ఆకాశంనుంచి వజ్రపు పొడి రాలుతున్నట్లు వుంది కారులైట్ల కాంతిలో.

కారుయింటికి చేరేవరకూ ఎవరమూ మాట్లాడలేదు. రోడ్డుమీద కారుఆపుచేసి లోపల కొచ్చాము యిద్దరం. వచ్చీరావడమే శాంతగదిలోకి వెళ్ళాము. ప్రొద్దుటికీ యిప్పటికి శాంత ఎంతో నీరసించిపోయినట్టు కనిపించింది నాకు. ఇట్లా అయిపోయిందే? ఎందుకింత నీరసించిపోయింది శాంత? మరీ తెల్లగా పాలిపోయి మంచానికి అతికించిన తెల్ల కాగితపు బొమ్మలావుందిశాంత. ప్రక్కలో చంటివాడు గుడ్డల్లో కలసిపోయి సరిగా కనిపించడంలేదు.

"ఎలా వుంది పిన్నీ శాంతకు?" అన్నాడు రఘు, అక్కడేకూర్చుని ఓవల్ కలుపుతూన్న అమ్మతో.

"మధ్యాహ్నం నువ్వువచ్చినప్పటిలానే వుంది రఘు! గుండెల్లో నొప్పి యింకా అలానే వుంది ఏమీ తగ్గలేదు—"

రఘు స్టెతస్కోపుతో చూచాడు.

"ఏంపరవాలేదు-అంతా బాగానే వుంది!అదంతా బలహీనత వల్లే. మరేం ఫరవాలేదు!"

“మరో యింజక్షన్ యివ్వకూడదు రఘు! అన్నాను నేను మనస్సు ఆగక.

రఘు నవ్వాడు నా ఆదుర్దా కనిపెట్టి.

“ఎందుకు? ఎప్పుడు ఏది అవసరమో నాకు తెలుసు. కావాలంటే నీ కిస్తాను నీ ఆదుర్దా తగ్గటానికి.”

అమ్మతో పాటు శాంతా నవ్వింది ఆమాటకు. ఏమో! ఆనవ్వులో జిగిలేదు; కళలేదు. అతినిస్సత్తువగా నవ్వింది శాంత. మునుపు శాంతనవ్వితే మణులు దొరికే కొండలోయల్లో మణులమీద ప్రవహించే కొండ వాగులా గల గలా అతిసున్నితంగా సాగిపోయేది, యిప్పుడా జిగి ఏది?

“చంటివాడు కూడా ఏమీ బాగోలేదు రఘు!’’ చూడు! రాత్రినుంచి పూరికే ఒకటే ఏడుపు!” అంటూ చంటివాడి ఒంటిమీద బట్టతీసి చూపించింది అమ్మ. ఎండిపోయిన శాంత రొమ్ములమధ్య తెల్లని పిండి బొమ్మలా అతుక్కుపోయి వున్నాడు వాడు.

రఘుచూచి ఏమీ ఫరవాలేదన్నాడు.

కొంతసేపు మాటాడినమీదట రఘు యింటికెళతానన్నాడు. భోజనంచేసి వెళ్లమంది అమ్మ. భోజనం అయిన తరువాత కాసేపు మాట్లాడి వాణ్ణి రోడ్డుదాకా పంపి, కారెక్కించి తిరిగి వచ్చేశాను మేడమీద గదిలోకి.

వర్షం ఇంకా కొద్దిగా కురుస్తూనేవుంది. మబ్బులు మాత్రం ఎక్కుతున్నాయి. నేను మేడఎక్కి గదిలోకి వచ్చేటప్పుడు హాల్లో గడియారం 12 గంటలు కొట్టడం వినిపించింది. ఆరాత్రి, తెల్లవారిన తరువాత మళ్లీ గదిలోకి రావడం యిదే మొదటిసారి.

గదిలో అడుగుపెట్టగానే మళ్ళీరాత్రి కలలో దృశ్యాలే తిరగనారంభించాయి. కిటికీలు కొట్టుకోడం హోరుమనేధ్వని చెవులు చిల్లులుపడేలా ఒకటే రొద!

అవే, ఆ దృశ్యాలేజ్ఞప్తి కొచ్చేవి.

క్రిందకుదిగి వెళ్లిపోయి వేరేగదిలో పడుకుంటే బాగుంటుందేమో ననిపించింది. తరువాత, అలా చెయ్యడం మానసిక బలహీనత అనిపించింది. ఏదో అసందర్భంగా వచ్చిన కలను తలంచుకుంటూ పిరికివాడిలా చంటి కుర్రాడిలా మానసిక ఆందోళన చెందుతూ గదిలోనుంచి పారిపోయి వేరేచోట పడుకోడం అవివేక మనిపించింది.

బయట వర్షం యింకా పూర్తిగా తగ్గలేదు. కొద్ది కొద్దిగా పడుతూనే వుంది. సముద్రం దగ్గరఅవడంవల్ల హోరుమంటూ సముద్రపుగాలి ఈడ్చికొడుతూంది. చలికి చేతులు వంకరలు తిరుగుతున్నాయి. ఆకాశం అంతా మేఘావృతమై బయట అంధకారంగా వుంది. గాలి ఎక్కువ అవడంవల్ల తలుపులు కిటికీలు మూసివేశాను. బయట మెరిసినప్పుడల్లా వెంటిలేటర్సులోనుంచి వెలుతురు గదిలోకి వస్తూంది.

ప్రక్కమీద పడుకున్నానేగాని నిద్రరావడం లేదు. ఏవో పాడు ఆలోచనలు మనస్సును కలతచెందిస్తున్నాయి. ఏవో అపశకునాలు క్షణం క్షణం గుర్తుకొస్తున్నాయి. మనస్సంతా శాంతమీదకి పోతూంది... ముందు ముందు శాంత కెలాగుంటుందో...అసలు శాంత నాకు దక్కుతుందా?... ఏమో!

ఈ ఆలోచనలు రాగానే గుండె ఝల్లుమంటుంది. క్రిందగదిలోనుంచి గాలిహోరుతో కలసి చంటివాడి ఏడుపు వినిపిస్తూంది సన్నగా. అప్పుడప్పుడు దిగంతాల్లో ఉరుములు వినిపిస్తున్నాయి. మూసివున్న తలుపు సందుల్ని తెలుపు చేస్తున్నాయి మెరుపులు.

అలానే కొన్నిక్షణాలవరకు మనస్సులోకి ఏవిధమైన ఆలోచన రాకుండా గట్టిగా కళ్లుమూసుకు పడుకున్నాను. అలా ఎంతసేపు ఉన్నానో తెలీదు–

అప్పుడప్పుడే మసక మసగ్గా నిద్రపడుతుంది. యింతలోనే బయటితలుపు ఎవరో కొట్టిన చప్పుడైంది. ఉలిక్కిపడి లేచాను. అయినా అది నా భ్రమేనేమో అని రెండుక్షణాలు అలానే ప్రక్కమీద కూర్చుండిపోయాను. కాని మళ్లీ తలుపుకొట్టిన చప్పుడు వినిపించింది. ఎవరో అర్థంకాలేదు. చేతిగడియారం చూస్తే వంటిగంట అయింది.

“బహుశ అమ్మేమో? శాంతకెలాగుందో!”

ఈ ఊహ తట్టగానే వెంటనే వెళ్లి తలుపు తీశాను– తలుపుతియ్యగానే ఎవరో ఒక కొత్త వ్యక్తి బాణంలా లోపలకి దూసుకొచ్చి, మళ్లీ వెంటనే తలుపు గడియవేశాడు! నేను స్తబ్ధుణ్ణయ్యాను. నోట మాట రాలేదు.

గదిలో వెలిగే లైటుకాంతిలో అవ్యక్తిని పరీక్షగా చూచాను. ఒళ్లంతా ఝల్లుమంది? శరీరం చెమటపోసింది.

అతనే! ఇందాక నేను కారులోవస్తూ చూచిన వ్యక్తి! రాత్రి కలలో నే చూచిన వ్యక్తి పోలికే వుంది......! అచ్చం శంతన్ రావే!

"నిజంగా శంతరావా...! మళ్ళీ ఏదైనా పైశాచికచర్యా...?" నేను తెల్లబోవడం ఆ వ్యక్తి కనిపెట్టాడు; పేలవంగా నవ్వాడు.

"ఏం శ్రీనీ...! అలా తెల్లబోతావేం...? గుర్తుపట్టలేదూ? నేనూ...శంతనరావును...! అవును. గుర్తు దొరకకుండా మారిపోయాను కదూ......? రా...! కూర్చో...! నీతో ఒక్క ముక్క మాట్లాడి పోదామని వచ్చాను...! మళ్లీ అయిదేళ్ళకి కలుసుకున్నాం కదూ...!"

అంటూ నాముఖంలోకి చూచి నీరసంగా నవ్వాడు.

ఆనవ్వులో జీవం లేదు; బీభత్సం లేదు. ఆమాటల్లో కరుకుతనం, కఠోరతా లేవు...ఎంతో పశ్చాత్తాపంగా అతి దైన్యంగా కనిపించాయి.

నే నేమీ సమాధానం చెప్పలేక అలానే చూస్తూ వుండిపోయాను. శరీరంలో మాంసం అంతా హరించుకుపోయి చర్మం ఎముకలకి అతుక్కుపోయివుంది. ఆ ముఖంలో క్రౌర్యం, గంభీరత లేవు. కళ్ళు, దౌడలు లోతుకు పోయాయి. కుడి కన్ను పూర్తిగా లోతుకు పీక్కుపోయి నీళ్లుకారుతోంది. బహుశ ఆరాత్రి తగిలిన దెబ్బకు ప్రతిఫలమేమో! పూర్తిగా పోయినట్టు వుంది. తలంతా పెరిగిపోయి రేగిపోయివుంది. బాగా మాసి, తడిసివున్న బట్టలు వాసనకొడుతున్నాయి. జుట్టులోనుంచి ముఖంమీదకు నీళ్లుకారుతూన్నాయి.

అప్పటి సన్నివేశం నాకంతా అయోమయంగా వున్నది. అది జరిగేది ప్రత్యక్షంగానా, మళ్లీ కలలోనా అనే అనుమానంకూడా కలుగుతోంది. నేను మాటా మంతీ లేకుండా శిలాప్రతిమలా అలానే అతను అనేది వింటూవుండిపోయాను—

"మాట్లాడవేం శ్రీనీ...! నామీద నీకున్న విహ్యభావం యింకా పోలేదా...పోదు శ్రీనీ—పోదు—కానీ యిప్పుడు నీ ఎదుట నిలబడ్డది ఆనాటి శంతనకాదు శ్రీనీ...శంతనరావు ఆనాటితో నే పూర్తిగా మారిపోయాడు...చివరిసారి నిన్ను కలుసుకుందామని...ఆనాటిరాత్రి చెప్పుకోలేని క్షమాపణ యిప్పుడు చెప్పుకుని పోదామని వచ్చాను...! అలా చెయ్యందే నేను ఎక్కడా ప్రశాంతంగా వుండలేను...ఒక్కసారి ఏ కల్మషమూ లేకుండా ఈమిత్రుణ్ని క్షమించానను శ్రీని...i నామనస్సు శాంతిస్తుంది...! నేను తిరిగి పోతాను...అందుకే వచ్చాను యింత దూరం...!"

ఉద్రేక పూరితంగా చెప్పుకుపోతూన్నాడు. ఒక్కసారిగా నా రెండు పాదాలను కౌగలించుకుని బావురు మన్నాడు...

అప్పటిస్థితిలో నేనేమనాలి...!ఏం చెయ్యాలి.?

అతన్ని, చూస్తూంటే నా మన్సులో జాలిపుట్టుకొచ్చింది. యిక మనస్సు ఉండబట్టలేక లేవదీసి సోఫాలో కూర్చోబెట్టాను—

అతను ఊరికే ఏడుస్తూన్నాడు. కళ్లన్నీ ఎర్రబడి నీళ్లు కారుతున్నాయి.

శంతన్...! ఎంతగా మారిపోయాడు శంతన్...? వాడిలో ఎంత పరివర్తన వచ్చింది...? ఎందుకిలా చిత్రంగా మారిపోయాడు...?

"శంతన్!" అన్నాను ఆప్యాయంగా.

ఈ పిలుపు వినగానే, స్వాతివానకు నోళ్లు తెరచుకుని సాగరంమీద తేలే ముత్యపు చిప్పలమీద స్వాతిచినకులు పడగానే ఘృనఃకరించి అతిశయంతో తిరిగి సాగరగర్భంలోకి పోయే ముత్యపుచిప్పలా అయింది శంతన్‌హృదయం.

నా కళ్లల్లోకి అతిదయనీయబాష్ప నయనాలతో చూచాడు.

"పోనీ శంతన్...! ఎప్పుడో జరిగినదానికి యిప్పుడు వ్యథ ఎందుకు...? అంతా మర్చిపో! నేనూ మర్చిపోయాను....

అయితే నువ్వయింతకాలం ఎక్కడున్నావు? అసలెందుకు వెళ్ళిపోయావు?" అన్నాను.

"నన్నడక్కు శ్రీని! అది నన్నడక్కు."

"ఆ రాత్రినుంచే నువ్వు కనిపించలేదు. మళ్ళీ మాకు ముఖం చూపించే ధైర్యంలేక, బిడియం, అభిమానం అడ్డొచ్చి పరారి అయ్యావా?అయితేయిన్నాళ్లా? కానీ ఆనాటి సంఘటన నాకు శాంతకు తప్పమరెవరికి తెలీదు శంతన్. నిన్ను ఆనాడే క్షమించాను శంతన్!"

"నాకు తెలుసు శ్రీనీ! నీలో ఆ సహనం వుంది. అసహనమే మళ్లానీకు, ఈ పరిసరాలకు దూరంచేసింది.

అయితే ఆఖరిసారిగా నీకు కనిపించి నీతో క్షమాపణ చెప్పుకు నేవరకు నామనస్సు వుండలేదు. అందుకనే యిటు వచ్చాను. నాపని అయింది. నేను యిక వెళ్లి పోతాను. శ్రీని!" అంటూ లేవడానికి ప్రయత్నించాడు.

నేను వారించాను. అప్పుడే "ఎక్కడికి వెడతావు శంతన్?"

నవ్వాడు శంతన్.

"ఎక్కడి కేముంది శ్రీనీ! కైలాసానికి!" అంటూ పేలవంగా నవ్వాడు.

"అంటే?"

మళ్ళీ నవ్వాడు శంతన్ "అంటె ఏముంది! నేను యిదివరకు చేసిన పాపాలకి పరిహారంగా తీర్థయాత్రలు చెయ్యాలనివుంది. అలా చేశానా పాపం కొంత పోతుందని నా ఆశ. నాలాటి పాపాత్ములు, పేరుకున్న పాపంతో కలుషితంతోనే చచ్చిపోతే తప్పకుండా పిశాచమయి పుడతను శ్రీనీ!—వద్దు...వద్దు ఆ పాడుబ్రతుకు నాకు యింకవద్దు—నేను బ్రతికుండగానే పిశాచంలా ప్రవర్తించాను. చనిపోయికూడ పిశాచంగా మారదలచ లేదు...అందుకని వెళుతున్నాను శ్రీనీ"

"నెమ్మదిగా వెళ్ళొచ్చు! మీ యింటికెళ్లావా? మీ వాళ్లు నీ కోసం కలవరిస్తున్నారు!"

"వద్దు శ్రీ...నీ నేనెవర్నీ కలువదలచలేదు...నీ గురించే యిక్కడకు వచ్చాను! నేను వెళతాను. నేను పూర్తిగా మారిపోయాను. ఈ ప్రపంచంలో వీణ్ణి క్షమించేది నువ్వు ఒక్కడివే అని నాకు తోచింది. అందుకని తుదిసారిగా నీ దగ్గరకు నిన్ను చూచిపోదామని వచ్చాను. నా పని అయిపోయింది. నేను వెళ్ళి పోవాలి. నన్ను వారించకు!"

"ఇంత రాత్రిలో ఎక్కడికి. పోనీ రేపు వెళ్దువు గాని!" అన్నాను. అయినా వాడు వినిపించుకోలేదు.

"ఇప్పుడే వెళ్ళాలి! ఈ రాత్రి ట్రైనుకే పోవాలి. మళ్లీ ప్రొద్దున్న ఎనిమిదయితేగాని ట్రయిను లేదు. నేనెవరికీ కనిపించలేదు. అందుకనే యిందాక రాత్రి ట్రయినుకే ఈవూరొచ్చాను! నన్ను మన్నించు నేను వెళుతున్నాను!" అంటూ లేచాడు.

లేస్తూనే చిరిగిపోయిన ఫాంటు జేబులోనుంచి ఏదో చిన్న కాగితపు పొట్లాంతీసి నా చేతిలో పెట్టాడు.

"దీన్ని రేపు ఉదయం నువ్వుప్రక్కమీదనుంచి లేవగానే విప్పిచూడు. అంతవరకూ దాన్ని విప్పవద్దని వేడుకుంటున్నాను. తెల్లవారిం తరువాతే విప్పిచూడు. నీకు అంతా అర్థమవుతుంది! అంటూ ఆ పొట్లాం నా చేతిలోపెట్టి చరచరా మెట్లుదిగి వెళ్లిపోవడం మొదలు పెట్టాడు.

వాడి వింతప్రవర్తన నాకర్థం కాలేదు. ఈ పొట్లాంలో ఏముందో! దీన్ని తెల్లవారినతరువాత విప్పిచూడటంలో అర్థమేమిటో! వాడు మెట్లన్నీ దిగి యింటిముందున్న గార్డెన్సులోకి వచ్చాడు. నేను వాణ్ణి అనుసరిస్తూనే వచ్చాను క్రిందకు.

ఇంకా చినుకులు తగ్గలేదు. అప్పుడప్పుడు కొద్దిగా మెరుస్తూంది. తోట దాటి గేటుదగ్గరకు వచ్చే సరికి, తోటకి ఎడమవైపున శాంత పడుకున్న గది కిటికీనుంచి చంటివాడి ఏడుపు వినిపించింది.

అది వినగానే వాడు ఠక్కున ఆగాడు.

నా ముఖంలోకి చూచాడు.

"ఏం శ్రీనీ! కొడుకా! ఎన్నోవాడు?" వాడలా అడిగినందుకు మనస్సెందుకో బాధనిపించింది.

"మొదటివాడే! పదహారు రోజులైంది వాడు పుట్టి!" వాడు దృష్టి ఆ కిటికీవైపుకి పోనిచ్చి కొన్ని క్షణాలు చూస్తూ వుండిపోయాడు—కిటికీకి వున్న నీలి తెరలోనుంచి లోపలలైటు కాంతి బయటకు చిమ్ముతూంది. వాడింకా ఏడుస్తూనే వున్నాడు.

శంతన్ నిట్టూర్చాడు.

"అదృష్టవంతుడివి శ్రీనీ! వాణ్ణి కూడా నీలానే తయారుచెయ్యి! భగవంతుడు వాడికి దీర్ఘాయుస్సు యిస్తాడు!" అని కొన్ని క్షణాలు వుండి అన్నాడు: "చూడు శ్రీనీ! వాణ్ణి చూచే అదృష్టానికి నోచుకో లేదు!" అంటూ నిట్టూర్చాడు.

"రేపు వుండగూడదూ చూపిస్తాను!" అన్నాను.

వాడెందుకో ఉలిక్కిపడ్డాడు.

"వద్దు-వద్దు శ్రీనీ! ఈ పాపిష్ఠి ముఖం శాంతకు చూపలేను! చూపను కూడా! వూరికినే అన్నాను!" అంటూ గేటు దాటి రోడ్డుమీద కొచ్చాడు.

బయట ఎక్కడో కుక్కలు మొరుగుతున్నాయి. వీధిలో దీపాలు ప్రశాంతంగా వెలుగుతున్నాయి. చిరు

జల్లు పడుతూనే వుంది ఇంకా. వాడు రెండు చేతులు పైకెత్తి నమస్కరించాడు.

"నువ్విక వుండిపో శ్రీనీ! నేను నీ దగ్గర కొచ్చినట్టు ఎవ్వరికీ తెలియనివ్వకు! ఈ మిత్రుణ్ణి మర్చిపోకు. నాకు వేళయింది శలవు!" అంటూ వెనక్కి తిరిగి, మళ్లీ యిటువైపయినా చూడకుండా చర చర నడచి వెళ్లిపోయాడు శంతన్.

కనుచూపు మేరవరకు అక్కడే నిలబడి వాణ్ణి చూస్తూండిపోయాను నేను. రానురాను వాడుదూరమై రోడ్డు మలుపు తిరిగి అంతర్ధానమయ్యాడు !

నాకు ఈ సంఘటన చిత్రంగా వుంది. మళ్ళీ శంతన్ ఈ రూపంలో తారసిల్లుతాడనుకోలేదు. మునుపటి శంతన్‌కి-నేను రాత్రి కలలో చూచిన శంతన్‌కి-యిప్పుడు చూచిన శంతన్‌కి ఎంత తేడా వుంది?

కొన్ని క్షణాలు అక్కడే నిలబడి మళ్ళీ నా గదిలోకి వచ్చేశాను.

గదిలోకి వచ్చినా యిప్పుడు సన్నివేశాలే కనిపిస్తున్నాయి - గదిలో వాడు వచ్చిన జాడ. తడి కాళ్లతో వచ్చిన అడుగుజాడలు అలానే వున్నాయి. వాడు కూర్చున్న సోఫాలో తడి యింకా అలానే ప్రత్యేకంగా కనిపిస్తూంది. ఇంకా శంతన్ అక్కడే కూర్చుని మాట్లాడుతూన్నట్టే వుంది. కొందరి కొందరి జీవితాల్ని కొన్ని సంఘటనలు అలా, అంత గాఢంగా మార్చివేస్తాయేమో !

వాడు యిచ్చిన పొట్లాం యింకా అలానే నా చేతిలోనే వుంది. అందులో ఏముందో అన్న ఆతురత ఎక్కువయింది. అయినా దాన్ని తెల్లవారిన తరువాత విప్పి చూడటానికి నిశ్చయించుకున్నాను. దాన్ని తలగడ క్రింద పెట్టి అలానే పడుకుండిపోయాను ఏవో తలపోస్తూ.

ఎప్పుడు నిద్ర పట్టిందో ఏమోగాని లేచేసరికి కిటికీల్లోంచి ఎండ గదిలోకి పడుతూంది. అప్పటికి బాగా తెల్లవారిపోయింది. రోడ్లమీద కారు హారన్ల చప్పుడు వినిపిస్తూంది.

ప్రక్కమీదనుంచి లేవగానే రాత్రి సన్నివేశాలే గుర్తుకొచ్చాయి. శంతన్ వచ్చినజాడ గదిలో కనిపిస్తూంది; గదిలో అడుగు జాడలు. ఆ సోఫా తడి యింకా ఆరిపోలేదు.

వెంటనే మంచం దగ్గరకు వెళ్ళి అక్కడవుంచిన పొట్లాం విప్పాను. తీరా చూస్తే ఆ పొట్లాంలో ఏమీ లేదు. మడిచివున్న చిన్న కాగితం ముక్కవుంది. అందులో ఏదో రాసి వుంది.

ప్రియమైన శ్రీని...!

నీకు చెప్పుకునేది ఏదో రాత్రే చెప్పుకున్నాను. అయితే మరో కోరిక ఒకటి వున్నది. అది అప్పుడు చెప్పడానికి వీలుండదు కాబట్టి ఈ ఉత్తరంలో రాస్తున్నాను...

ఆ రాత్రి నేను ఏ పవిత్రమైన స్థలంలో ఒక పవిత్రమూర్తిమీద అఘాయిత్యం తలపెట్టానో ఆ పవిత్రమైన ఆలయం ప్రాంగణంలో, ఆ జువ్విచెట్టు క్రింద నా శవం వుంటుంది...! దానిమీద ఒక్క బాష్పబిందువూ పడదని నాకు తెలుసు. నిన్ను ముఖ్యంగా అర్థించేది ఏమిటంటే నువ్వు మాత్రం నా శవంమ్మీద రెండు కన్నీటిబొట్లు రాల్చు!...ఆ నమ్మకం నాకుంది నువ్వు అలా చేస్తే నా ఆత్మ శాంతిస్తుంది...అలా కాని నాడు నేను దిక్కులేని చావు చచ్చినవాణ్ణవుతాను అలా చావడం నా కిష్టంలేదు...ఎందుకంటే అలా దిక్కులేని చావు చచ్చిన వాళ్లంతా పిశాచాలవుతారని నా నమ్మకం...! అందుకని నేను అలా మారకూడదు...! మారను—

నేను నిన్ను చివరిసారిగా అర్థించేది అదే శ్రీనీ! నా శవంమీద పవిత్రమైన నీ కన్నీటిబొట్లు రెండు రాల్చు...! అది చాలు. నాకు మరి జన్మవుండదు...లే! ఆ శివాలయం దగ్గరకు రా...! రా శ్రీనీ !—

ఇట్లు,
నీ మిత్రుడు
శంతన్.

ఆ ఉత్తరం ముగియగానే భూమి కంపించినట్టయింది. ఇక అక్కడ ఆలస్యం చెయ్యకుండా తలుపు తోసుకుని మెట్లు దిగాను. అమ్మ కూడా ఆదుర్దాగా నా కెదురయింది మెట్లమీద.

"ఇది విన్నావా శ్రీని...! మన శివాలయం దగ్గర జువ్వి చెట్టు క్రింద ఎవరిదో శవం వుందట...! అది అచ్చం...మన అవధానిగారి కొడుకు శంతన్‌రావులానే వుందట...! పాపం వాడు పరారీ అయి అయిదేళ్లయింది కదూ...? అందరూ అక్కడికిపోతూన్నారు చూట్టానికి!" అంది అమ్మ.

నాకు అమ్మమాటలు వినిపించుకో బుద్ధి కాలేదు. నేను ఆదుర్దాగా ఆలయం వైపుకి పరుగెత్తుతోంటే అమ్మకి ఏమీ అర్థంగాక అలానే నిలబడి చూస్తూ వుండిపోయింది!